VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 26 సెప్టెంబర్ 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 89



PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## సంఘ్ పరివార్ దేశాన్ని విభజిస్తోంది

**దానివల్ల ప్రజాస్వామ్యానికి అతిపెద్ద ముప్పు**

**దేశ విభజన యత్నాలకు తెరదించాలంటే రాహుల్‌ను ప్రధాని చేయాలి : సీఎం రేవంత్‌రెడ్డి**

**ఆర్యదాన్ ముహమ్మద్ అవార్డు స్వీకరణ**

హైదరాబాద్, సెప్టెంబర్ 25 : దేశాన్ని కుల మతాలు, ప్రాంతాలు, భాషల పేరుతో విభజించేందుకు సంఘ్ పరివార్ ప్రయత్నిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పుగా ఆ సంస్థ పరిణమించిందని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో దేశంలో రెండు పరివార్‌ల మధ్య నేరుగా రాజకీయ పోరాటం కొనసాగుతోందని.. అందులో ఒకటి సంఘ్ పరివార్ అయితే.. రెండోది దేశ ఐక్యత కోసం పనిచేస్తున్న గాంధీ పరివార్ అని చెప్పారు. దేశాన్ని రక్షించాలన్నా, మన స్వేచ్ఛను కాపాడుకోవాలన్నా, దేశ విభజన ప్రయత్నాలకు తెరదించాలన్నా యావత్ దేశమంతా గాంధీ పరివార్‌కు అండగా నిలవాలని.. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి అయ్యేలా చూడాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేరళంకు చెందిన దిగ్గజ కాంగ్రెస్ నేత, దివంగత మాజీ మంత్రి ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఏర్పాటైన ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ తనకు ప్రకటించిన ఆర్యదాన్ ముహమ్మద్--2026 ఉత్తమ ప్రజా సేవకుడు పురస్కారాన్ని స్వీకరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కేరళం వెళ్లారు. నీలంబూర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా రేవంత్‌రెడ్డి ఈ పురస్కారాన్ని స్వీకరించారు.

-మిగతా 2 లో..

# గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి

**హుస్సేన్‌సాగర్‌లో ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం**

**హుస్సేన్‌సాగర్‌లో 69 అడుగుల ఖైరతాబాద్ మహాగణపతికి నిమజ్జనం**

**టస్కర్‌పై సాగిన భారీ విగ్రహం శోభాయాత్ర**

**పోలీసుల పటిష్ఠ భద్రత మధ్య కార్యక్రమం పూర్తి**



ఖైరతాబాద్, సెప్టెంబర్ 25: హైదరా బాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు శుక్రవారం ప్రశాంత వాతా వరణంలో ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో పంచముఖ సంకటహర మహాగణపతిగా భక్తుల కు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహా న్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఉదయం ఖైరతాబాద్ నుంచి ప్రారంభమైన శోభాయాత్ర ఎన్టీఆర్ మార్గ్ మీదుగా సాగి నిమజ్జన వేదికకు చేరుకుంది. నిమజ్జ నానికి ముందు అర్ధరాత్రి నుంచే విగ్రహ దర్శనాలను నిలిపివేశారు. అనంతరం

-మిగతా 2 లో..



## కేసుల భారానికి చెక్

**తెలంగాణలో మరో 200 కోర్టులకు గ్రీన్ సిగ్నల్!**

**తొలి దశలో 200 జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు అనుమతి**

**రాచకొండ పరిధిలోని జిల్లాలకు పెద్ద సంఖ్యలో కొత్త న్యాయస్థానాలు**

**మొత్తం 594 కోర్టుల ఏర్పాటుకు హైకోర్టు ప్రతిపాదన**

హైదరాబాద్, సెప్టెంబర్ 25 : కేసులు పేరుకుపోతున్న కొద్దీ వాటి పరిష్కారానికి ఎదురుచూసే సమయం కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో న్యాయస్థానాల సంఖ్యను పెంచు తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతగా 200 కొత్త జూనియర్ సివిల్ జడ్జి-కమ్ అదనపు

-మిగతా 2 లో..



## అర్హుల పేర్లు తొలగిస్తున్నారు

**ఓటర్ల జాబితాపై మహేశ్‌కుమార్ గౌడ్ ఫైర్..**

**నోటీసులతో పౌరులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపణ**

**ఈసీ చీఫ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

నిజామాబాద్, సెప్టెంబర్ 25: నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఓటర్ల జాబితా అంశాన్ని ప్రస్తావించారు. అర్హత ఉన్న పౌరుల పేర్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఓటు

-మిగతా 2 లో..



## మెడల్ కొట్టినోళ్లకు కాసుల వర్షం.. సీఎం విజయ్ నజరానా!

**విద్య, విశాల్‌కు చెరో రూ 50 లక్షలు.. కమలినికి రూ75 లక్షలు**

**వెబ్ డెస్క్, సెప్టెంబర్ 25:** ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన తమిళనాడు అథ్లెట్లకు సీఎం విజయ్ భారీ నజరానా ప్రకటించారు. 4ఐ400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో రజతం సాధించిన విద్య రామరాజ్, విశాల్‌కు చెరో రూ.50 లక్షలు ఇవ్వనున్నట్లు సీఎం కార్యాలయం తెలిపింది. ఎలైట్ స్పోర్ట్స్‌పర్సన్ స్కీమ్ కింద ఈ సాయం అందనుంది. ఇప్పటికే స్వర్ణం సాధించిన భారత మహిళా క్రికెట్ జట్టు సభ్యురాలు జి. కమలినికి రూ.75 లక్షలు ప్రకటించారు. యువ అథ్లెట్లు మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి పేరు తేవాలని విజయ్ ఆకాంక్షించారు. మిక్స్‌డ్ రిలేలో భారత్ 3:14.46 టైమింగ్‌తో రజతం సాధించింది.



## గాంధీకి ఈడీ నోటీస్..

**రూ.2.1 కోట్ల లెక్కేంది భాయ్?**

**హైదరాబాద్, సెప్టెంబర్ 25**

: సాహితీ ఇన్‌ఫ్రా మనీలాండరింగ్ కేసులో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఈడీ నోటీసులు జారీ చేసింది. రూ.2.1 కోట్ల నగదు లావాదేవీలపై వివరణ కోసం ఈ నెల 27న విచారణకు రావాలని ఆదేశించినట్టు సమాచారం. సాహితీ ఇన్‌ఫ్రా ఖాతాల నుంచి గాంధీకి సుమారు రూ.2.1 కోట్లు బదిలీ అయినట్టు దర్యాప్తులో గుర్తించినట్లు తెలుస్తోంది.తెలంగాణ పోలీసుల ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేస్తోంది. ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో కొనుగోలుదారుల నుంచి నిధులు సేకరించి దారి మళ్లించారనే ఆరోపణలపై కేసు కొనసాగుతోంది. గతంలో రూ.161 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

## ఎల్లంపల్లి వరదను జలాశయాలకు ఎందుకు మళ్లించరు?

**గోదావరి ప్రవాహాన్ని ఉపయోగించుకుని రిజర్వాయర్లు నింపాలన్న హరీశ్‌రావు**

**మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ సహా పలు జలాశయాల పరిస్థితిపై ఆందోళన**

**24 గంటల పాటు పంపులు పనిచేసేలా చూడాలని మంత్రి ఉత్తమ్‌కు లేఖ**

గోదావరిలో నీరు ఉరకలేస్తున్న సమయంలో రిజర్వాయర్లు మాత్రం ఖాళీగా ఎందుకు ఉండాలన్న ప్రశ్నను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు లేవనెత్తారు. ఎల్లంపల్లి వద్ద కొనసాగుతున్న వరద ప్రవాహాన్ని కాళేశ్వరం ఎత్తిపోతల వ్యవస్థ ద్వారా అందుబాటులో ఉన్న జలాశయాలకు తరలించాలని కోరారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శుక్రవారం ఆయన లేఖ రాశారు. వరద నీరు అందుబాటులో ఉన్న ఈ సమయంలో పంపులను పూర్తి సామర్థ్యంతో వినియోగించాలని సూచించారు.



హైదరాబాద్, సెప్టెంబర్ 25 : గోదావరి నీటిని నిల్వ చేసుకునే ఉద్దేశంతో కాళేశ్వరం వ్యవస్థలో భాగంగా 141 టీఎంసీల సామర్థ్యంతో వివిధ రిజర్వాయర్లను నిర్మించినట్లు హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం నదిలో నీటి లభ్యత ఉన్నందున ఆ అవకాశాన్ని వినియోగించుకుని జలాశ యాల్లో నిల్వలు పెంచాలని కోరారు. ఎల్‌నినో పరిస్థితులను కారణంగా చూపకుండా అందుబాటులో ఉన్న నీటిని వ్యవసాయ అవసరాలకు మళ్లించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీ స్థాయిలో ఉన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. మల్లన్నసాగర్‌లో ప్రస్తుతం సుమారు 13 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, మొత్తం 50 టీఎంసీల నిల్వ సామర్థ్యం అందుబాటులో

-మిగతా 2 లో..

## ఓటు బ్యాంక్ కాదు.. సమాజ్ చేంజ్ కావాలె!





**బీజేపీ కార్యకర్తలకు మోదీ పిలుపు..**

**పాజిటివ్ మార్పుపై ఫోకస్**

**వెబ్ డెస్క్, సెప్టెంబర్ 25:**

ఓటు బ్యాంకు రాజకీయాల కంటే సామాజిక సంస్కరణలు, పాజిటివ్ చేంజ్‌పై ఫోకస్ చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వారణాసి--వాద్‌న గర్ సేవా యాత్రలో పాల్గొంటున్న వారితో శుక్రవారం వర్చువల్‌గా మాట్లాడారు. గత 12 ఏళ్లలో నగరాలు, గ్రామాల మధ్య గ్యాప్ తగ్గిందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగయ్యాయని మోదీ చెప్పారు. మహిళల్లో స్వయం సమృద్ధి కూడా పెరిగిందన్నారుద . మహాత్మా గాంధీ స్వాతంత్ర్య పోరాటంతో పాటు సామాజిక సంస్కర్తగా పనిచేశారని గుర్తుచేశారు. సమాజంలోని దురా చారాలపై పోరాడిన ఆయన స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కార్యకర్తలకు సూచించారు.



## మార్కెట్‌కు మళ్లీ మజా..లాభాల్లో దూకిన సెన్సెక్స్!

# అర్హుల పేర్లు తొలగిస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)



వేసిన పౌరులకు సైతం నోటీసులు జారీ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ వ్యవహారంలో కుట్రకు పాల్పడుతోందని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. దేశ పౌరులుగా ఉన్న వారికి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అర్హత ఉన్న ప్రతి వ్యక్తి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలని కోరారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై కూడా ఆయన స్పందించారు. ఈసీ ప్రధాన అధికారి పదవి నుంచి తప్పుకోవాలని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ డిమాండ్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ డిమాండ్ మేరకు చర్యలు తీసుకోవాలని, లేకపోతే సంబంధిత అధికారులపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఇదిలా ఉండగా నిజామాబాద్‌లో గణేశ్ నిమజ్జన వేడుకల్లో మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. గణనాథుడిని సాగనంపే సందర్భంగా రాష్ట్ర ప్రజలకు మేలు జరగాలని, వ్యవసాయం, విద్య, వైద్యం తదితర రంగాల్లో తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరాలని కోరుకున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రజల ఆశీస్సులు కాంగ్రెస్‌కు కొనసాగాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా సవరణపై తెలంగాణ కాంగ్రెస్ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో.. మహేశ్‌కుమార్ గౌడ్ తాజా వ్యాఖ్యలు ఆ రాజకీయ అంశాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చాయి.



# రూ.2.1 కోట్ల లావాదేవీలు..

(మొదటిపేజీ తరువాయి)

తీసుకునేందుకు గాంధీకి సమన్లు జారీ చేసింది. సెప్టెంబర్ 27న విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. తెలంగాణ పోలీసులు నమోదు చేసిన కేసులు, ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా సాహితి ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన వ్యవహారంపై ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద దర్యాప్తు కొనసాగిస్తోంది. ఫ్లాట్లు, విల్లాలు నిర్మిస్తామని చెప్పి ప్రీ-లాంచ్ పథకాల ద్వారా కొనుగోలుదారుల నుంచి డబ్బులు సమీకరించి మళ్లించినట్లు సంస్థపై ఆరోపణలు ఉన్నాయి.

## రూ.248 కోట్ల నుంచి రూ.842 కోట్లకు..

సాహితి ఇన్‌ఫ్రా వ్యవహారంలో తొలిదశలో సుమారు రూ.248 కోట్ల మేర మోసం జరిగినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. దర్యాప్తు విస్తరించిన తరువాత ఆ మొత్తం సుమారు రూ.842 కోట్లకు చేరినట్లు ఈడీ అంచనా వేసింది. సేకరించిన నిధుల్లో కొంత భాగం సంస్థకు సంబంధించిన వ్యక్తిగత, కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించినట్లు దర్యాప్తు సంస్థ ఆరోపిస్తోంది. సుమారు రూ.126 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు కూడా పేర్కొంది. ఈ నేపథ్యంలోనే గాంధీకి సంబంధించిన ఖాతాల్లోకి చేరినట్లు చెబుతున్న రూ.2.1 కోట్లపై ఈడీ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఆ మొత్తాల బదిలీకి కారణం ఏమిటి, వాటికి సంబంధించిన ఆర్థిక సంబంధాలు ఏంటి, లావాదేవీలకు చట్టబద్ధమైన ఆధారం ఉందా అనే అంశాలను విచారణలో పరిశీలించనున్నట్లు సమాచారం. సాహితి ఇన్‌ఫ్రా నిధుల ప్రవాహంతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న ఇతర ఆస్తులు, లావాదేవీలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

## ఆస్తులు, ఖాతాలపైనా చర్యలు

కేసు దర్యాప్తులో భాగంగా ఇప్పటివరకు 56 బ్యాంకు ఖాతాలను ఈడీ ఫ్రీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. గతంలో సుమారు రూ.161 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేయగా, తదుపరి దశలో మరో రూ.12.6 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసినట్లు తెలిపారు. బినామీ పేర్లతో ఆస్తుల కొనుగోళ్లకు సంబంధించిన అంశాలను కూడా దర్యాప్తు సంస్థ పరిశీలిస్తున్నట్లు పేర్కొంది.

## సంస్థ ఎండీ అరెస్టు.. విచారణ కొనసాగింపు

సాహితి ఇన్‌ఫ్రా కేసులో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి. లక్ష్మీనారాయణతో పాటు మాజీ డైరెక్టర్ సందు పూర్ణచంద్రరావు తదితరులపై దర్యాప్తు కొనసాగుతోంది. సంస్థ ఎండీ లక్ష్మీనారాయణను 2024 సెప్టెంబర్‌లో ఈడీ అరెస్టు చేసింది. సాహితి ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల ప్రచార కార్యక్రమాల్లో కనిపించిన నటుడు జగపతిబాబును కూడా గతంలో సాక్షిగా విచారించినట్లు అధికారులు వెల్లడించారు. తాజాగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి సమన్లు జారీ కావడంతో కేసులో మరో కీలక విచారణ దశకు చేరుకుంది. సెప్టెంబర్ 27న జరిగే విచారణలో రూ.2.1 కోట్లుగా పేర్కొంటున్న లావాదేవీలపై ఈడీ అధికారులు వివరాలు కోరనున్నట్లు సమాచారం. ఆ విచారణలో వెలువడే సమాచారం ఆధారంగా దర్యాప్తు తదుపరి దశ ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

# సంఘ్ పరివార్ దేశాన్ని విభజిస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతోపాటు రేవంత్‌రెడ్డి నాయకత్వం, ప్రజాస్వామ్య విలువలపై ఆయన నిబద్ధతకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. అవార్డు కింద రూ. లక్ష నగదు, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందించారు. ఈ పురస్కారం అందుకున్న అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్యదాన్ ముహమ్మద్ సేవలను స్మరించుకున్నారు. ఐదు దశాబ్దాలకుపైగా కాంగ్రెస్ కోసం పనిచేసిన ఆర్యదాన్ ముహమ్మద్ కేరళం రాజకీయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని చెప్పారు. ఆయన పేరిట ఏర్పాటు చేసిన అవార్డును అందుకోవడం ఎంతో గౌరవంగా ఉందన్నారు. కేరళం వెలుపల నుంచి ఈ పురస్కారానికి ఎంపికైన తొలి వ్యక్తిగా నిలవడం మరింత ప్రత్యేకమని చెప్పారు. స్వేచ్ఛ, లౌకికవాదం, రాజ్యాంగ విలువలను కాపాడటమే ఆర్యదాన్ ముహమ్మద్‌కు ఇచ్చే నిజమైన నివాళి అవుతుందన్నారు. ఈ ఏడాది కేరళం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన విజయం కొత్త రాజకీయ గాలికి నాంది పలికిందని.. కేరళం నుంచి మొదలైన ఈ రాజకీయ గాలి దేశమంతా తుపానుగా మారాలని రేవంత్ పిలుపునిచ్చారు. దేశంలో ఓట్ల దొంగతనం, పార్టీల దొంగతనం, ఎన్నికల గుర్తుల దొంగతనం, నిధుల దొంగతనం జరుగుతున్నాయంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై రేవంత్‌రెడ్డి పరోక్షంగా విమర్శలు చేశారు. యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న ఓటు హక్కును కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తనకంటూ వ్యక్తిగత రాజకీయ ఆశలేవీ లేవన్న రేవంత్‌రెడ్డి.. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడటమే తన ముందున్న ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ కేరళ నుంచి పార్లమెంట్‌కు ఎన్నిక కావడం తనకు ఈ రాష్ట్రంతో మరింత అనుబంధాన్ని కల్పించిందన్నారు.



# గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి

(మొదటిపేజీ తరువాయి)

మండపం, షెడ్లు, బ్యారికేడ్లను తొలగించి మహాగణపతిని తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక టస్కర్ వాహనంపై విగ్రహాన్ని ఎక్కించి శోభాయాత్రకు సిద్ధం చేశారు. అయితే విగ్రహాన్ని తరలించే సమయంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో శోభాయాత్ర నిర్ణయించిన సమయానికి ప్రారంభం కాలేదు. దాదాపు మూడున్నర గంటల ఆలస్యంతో ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ఊరేగింపు మొదలైంది. రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది. మహాగణపతిని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఖైరతాబాద్ పరిసరాల్లో సందడి నెలకొంది. మరోవైపు నిమజ్జన మార్గంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. ప్రధాన ఊరేగింపు మార్గాల్లో విగ్రహాలను తరలించే వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. నిమజ్జనోత్సవాల సందర్భంగా నగరవ్యాప్తంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 20 వేల మంది పోలీసులను విధుల్లో మోహరించడంతో పాటు ప్రధాన మార్గాల్లో ఏర్పాటు చేసిన వేలాది సీసీటీవీలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించారు. చివరికి ఖైరతాబాద్ మహాగణపతి హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం కావడంతో ఈ ఏడాది ఉత్సవాలకు అధికారికంగా ముగింపు పలికినట్లైంది. నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన గణేశ్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు కూడా కొనసాగాయి.





# ఎల్లంపల్లి వరదను జలాశయాలకు ఎందుకు మళ్లించరు?

(మొదటిపేజీ తరువాయి)

ఉందని తెలిపారు. మల్లన్నసాగర్ పూర్తిగా నిండితే హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకు తోడ్పడటంతో పాటు మూసీ ప్రాజెక్టుకు కూడా నీటిని తరలించే అవకాశం ఉంటుందని వివరించారు. కొండపోచమ్మసాగర్ పరిస్థితినీ ఆయన ప్రస్తావించారు. 15 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ రిజర్వాయర్‌లో ప్రస్తుతం సుమారు 6 టీఎంసీల నీరు మాత్రమే ఉందని తెలిపారు. ఎల్లంపల్లి నుంచి నీటిని ఎత్తిపోస్తే యాదాద్రి భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లకూ ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.



## పలు జిల్లాలకు ప్రయోజనం

ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతలు కొనసాగిస్తే మిడ్‌మానేరు, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, గంధమల్ల, బస్వాపూర్ వంటి జలాశయాలకు నీటిని తరలించే అవకాశం ఉంటుందని హరీశ్‌రావు తెలిపారు. దీనివల్ల సుమారు ఐదు లక్షల ఎకరాల సాగుకు తోడ్పాటు లభించడంతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. మిడ్‌మానేరు దిగువన ఉన్న లోయర్ మానేరు డ్యాంలోనూ ప్రస్తుతం సుమారు 11 టీఎంసీల నీరు మాత్రమే ఉందని ఆయన తెలిపారు. అక్కడికి నీటిని తరలిస్తే కరీంనగర్, వరంగల్ ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాలను కొంతమేర తీర్చవచ్చని వివరించారు. పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, యాదాద్రి భువనగిరి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు దీనివల్ల ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు.

## పామాయిల్ పరిశ్రమకూ నీటి సమస్య

సిద్దిపేట జిల్లా నర్మెట్టలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన పామాయిల్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారని హరీశ్‌రావు తన లేఖలో ప్రస్తావించారు. పరిశ్రమ అవసరాల కోసం రంగనాయకసాగర్ నుంచి నీటిని తరలించేలా అప్పట్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం ఆ రిజర్వాయర్‌లో తగినంత నీరు లేకపోవడంతో ఫ్యాక్టరీ నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. గోదావరిలో భారీ ప్రవాహం ఉన్నప్పటికీ ఎత్తిపోతల వ్యవస్థను పూర్తిస్థాయిలో ఉపయోగించకపోవడం వల్ల రైతులకు నష్టం జరుగుతోందని హరీశ్‌రావు ఆరోపించారు. జలాశయాల్లో నిల్వలు తగ్గిపోతున్న పరిస్థితికి నీటి నిర్వహణలో ప్రభుత్వ వైఖరే కారణమని ఆయన విమర్శించారు. రాజకీయ అంశాలను పక్కనపెట్టి ప్రస్తుతం లభిస్తున్న గోదావరి జలాలను రైతుల అవసరాలకు వినియోగించాలని, ప్రకృతి పరిస్థితులను సాకుగా చూపకుండా సాగునీటి విషయంలో ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు.



# న్యూ హౌసింగ్ బోర్డు కాలనీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో..

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

న్యూ హౌసింగ్ బోర్డు కాలనీ, హనుమాన్ ఆలయంలో... కాలనీ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అంతకుముందు వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు బండి సాయగౌడ్, ఉపాధ్యక్షుడు సునీల్ జాదవ్, కోశాధికారి రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 'బ్రహ్మోస్'తో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు

(మొదటిపేజీ తరువాయి)

నాశనం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నోయిడాలో నిర్వహించిన ఉత్తర్‌ప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. 2017 తర్వాత భాజపా హయాంలో యూపీ అద్భుత ప్రగతి సాధిస్తోందన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో భారత్ గణనీయమైన ఆర్థిక వృద్ధి సాధిస్తోందన్న అమిత్ షా.. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేనప్పటికీ స్థిరమైన వృద్ధిరేటు సాధిస్తున్నామన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను ఉన్నత స్థితికి చేర్చే లక్ష్యంగాలో భాగంగానే.. మారిషస్, యూఏఈ, ఆస్ట్రియా, యూకే, ఒమన్, న్యూజిలాండ్, యూరోపియన్ యూనియన్ తదితర దేశాలతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు చెప్పారు. యూపీలో అమలు చేస్తున్న 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' విధానాన్ని అమిత్ షా అభినందించారు. గతంలో ఇక్కడి ప్రజలు ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లేవారని.. కానీ, ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయన్నారు. గతంలో నేరపూరిత వాతావరణం ఉన్న రాష్ట్రం.. ఇప్పుడు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో రక్షణ రంగం, వాహన ఉత్పత్తి, వైద్యపరికరాల తయారీ వైపు దూసుకెళ్తోందని కితాబిచ్చారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున (సెప్టెంబర్ 25) ప్రధాని మోదీ 'మేక్ ఇన్ ఇండియా' నినాదం తీసుకొచ్చినట్లు అమిత్ షా గుర్తు చేశారు.





# కొంపముంచిన రీల్స్..

- రీల్స్ చేస్తే.. రియల్‌గా దోచేశారు
- బంగారు, వజ్రాభరణాలతో పాటు నగదు అపహరణ

**చెన్నై:** తమిళనాడు, కన్యాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ సమీపంలోని తమ్మత్తుకోణం ప్రాంతంలో యూట్యూబర్ మధుమిత, ఆమె భర్త వినోద్‌కుమార్ ఇంట్లో భారీ చోరీ జరిగింది. దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బంగారు, వజ్రాభరణాలతో పాటు పెద్ద ఎత్తున నగదును అపహరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన గురువారం సాయంత్రం నుంచి రాత్రి మధ్య చోటుచేసుకుంది. మధుమిత, వినోద్‌కుమార్ తమ కూతురితో కలిసి గురువారం సాయంత్రం దుస్తులు కొనుగోలు చేసేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లారు. రాత్రి తిరిగి వచ్చిన తర్వాత పడకగదిలోని బీరువా పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. అందులో ఉంచిన బంగారు, వజ్రాభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంటి వెనుక తలుపు తాళాన్ని కటింగ్ యంత్రంతో కోసి దుండగుడు లోపలికి ప్రవేశించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అనంతరం పడకగదిలోని బీరువా తాళాన్ని పగులగొట్టి అందులో ఉన్న నగలు, నగదును తీసుకెళ్లినట్లు గుర్తించారు. మధుమిత సామాజిక మాధ్యమాల్లో నగదు, బంగారు ఆభరణాలను చూపిస్తూ గతంలో పలు వీడియోలు చేసినట్లు స్థానిక కథనాలు పేర్కొన్నాయి. ఆ వీడియోలు కూడా చోరీకి సంబంధించిన దర్యాప్తులో పరిశీలనకు వస్తున్నట్లు సమాచారం. అయితే చోరీకి వీడియోలే కారణమని నిర్ధారించే ఆధారాలు ఇంకా వెల్లడికాలేదు. సమాచారం అందుకున్న రాజాక్కమంగళం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. పరిసరాల్లోని నిఘా కెమెరాల దృశ్యాలను సేకరించి పరిశీలిస్తున్నారు. నిందితుల కోసం 3 ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. దొంగిలించిన ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితులను గుర్తించడం దర్యాప్తులో తదుపరి కీలక అంశంగా ఉంది.

# వేతన సవరణ కోసం బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ధర్నా.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**




కేంద్ర ప్రభుత్వం తక్షణం తమ వేతన సవరణ చేపట్టాలని బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఆల్ యూనియన్స్ అండ్ అసోసియేషన్స్ న్యూఢిల్లీ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం నిజామాబాదులో ని సంచార్ భవన్ వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏయుఏబి జిల్లా కన్వీనర్ ఈవిఎల్ నారాయణ మాట్లాడుతూ, బిఎస్ఎన్ఎల్ లో 2017 జనవరిలో జరగవలసిన వేతన సవరణ దాదాపు పది సంవత్సరాలు కావస్తున్న ఇంతవరకు జరుపలేదని, దీనికి కేంద్ర ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్ కు వస్తున్న నష్టాలని కారణంగా చూపుతోందని అన్నారు. కానీ ఈ నష్టాలకు కారణం ప్రభుత్వ విధానాలేనని సకాలంలో బిఎస్ఎన్ఎల్ కు కావలసిన ఆధునిక సాంకేతిక పరికరాలను బిఎస్ఎన్ఎల్ కు అందించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని అందుకే నష్టాలు సంభవిస్తున్నాయని అన్నారు. ఈ నష్టాలకు ఉద్యోగులు, అధికారులు కారణం కాదని అందువలన ప్రభుత్వం విధించిన అఫర్టబిలిటీ క్లాజ్ నుండి బిఎస్ఎన్ఎల్ ను తొలగించి ఉద్యోగులకు, అధికారులకు వెంటనే మూడవవేతన సవరణను జరపాలని, అలాగే పెన్షన్ సవరణ కూడా జరపాలని డిమాండ్ చేశారు. ఎన్ ఎఫ్ టి ఈ యూనియన్ జిల్లా అధ్యక్షులు మస్తాన్వలి మాట్లాడుతూ, ఒకటి ఒకటి 2017 నుండి వేతన సవరణ చేయకపోవడం చాలా అన్యాయమని ఇప్పటికైనా ఉద్యోగుల అధికారులు అందరూ కలిసి ఐక్యవేదికగా ఏర్పడి ఈ ధర్నాలో పాల్గొనడం హర్షించదగినదని, ఇలాగే మనం ఐక్యంగా పోరాడితే కచ్చితంగా సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఎస్ఎన్టిఏ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ల నాయకులు రాజేందర్ మాట్లాడుతూ, బిఎస్ఎన్ఎల్ అన్నది సేవా రంగ సంస్థని దీనికి లాభనష్టాలతో ముడిపెట్టి న ఆపివేయడం అన్యాయము అని అన్నారు. ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు హనుమాన్ సింగ్ బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సాయిలు మరియు సాయన్న అకౌంట్స్ ఆఫీసర్ విజయకుమార్ మాట్లాడారు. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సమస్యలపై సిర్ప లింగం స్వయంగా పాటలను వ్రాసి ఆలపించారు. ఈ ధర్నా కార్యక్రమంలో చంద్రశేఖర్, అనురాధ, లీల ,సుభాష్, అజయ్, తదితర ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోనే ప్రత్యేకం ఇందూరు వినాయకుడి శోభాయాత్ర.

**జెండా ఊపి ప్రారంభించిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...**

**దుబ్బ చౌరస్తా నుంచి వినాయకుల బావి వరకు రథం వెంట ఎమ్మెల్యే...**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



రాష్ట్ర రాజధాని తర్వాత ఇందూరులోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా వినాయకుడి శోభాయాత్ర కొనసాగుతుందని, ఎంతో ఘన చరిత్ర ఉందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని దుబ్బ చౌరస్తాలో శు క్రవారం రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్వాతంత్ర ఉద్యమంలో ఐక్యత కోసం బాలగంగాధర్ తిలక్ ఇచ్చిన పిలుపుమేరకు ఇందూరులోనూ వినాయకుడి రథయాత్ర ప్రారంభించారని గుర్తు చేశారు. 21 జతల ఎడ్లతో అంగరంగ వైభవంగా శోభాయాత్ర నగరంలోని ప్రధాన వీధుల మీదుగా ముందుకు సాగుతుందన్నారు. యువత భక్తమార్గంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, ఇందుకు ఇందూరు యువతే నిదర్శనమన్నారు. వందేళ్లుగా రథం శోభాయాత్ర సాంప్రదాయం కొనసాగుతుందన్నారు. ప్రధానంగా నగరంలోని పలు కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు శోభాయాత్ర ఆద్యాంతం సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# సార్వజనిక్ గణేష్ మండలి వద్ద ప్రత్యేక పూజలు.







**- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 25**



: వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు, సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, పుర ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాసన మండలి సభ్యుడు బి.మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ కూరగాయల ఉమారాణి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ వి.భుజంగరావు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 2.00 గంటల సమయంలో దుబ్బ ప్రాంతంలోని సార్వజనిక్ గణేష్ మండలి వద్దకు ప్రజాప్రతినిధులు, అధికారులు చేరుకుని, వినాయక నిమజ్జన శోభాయాత్ర రథం వద్ద టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు వీరికి స్వాగతం పలికారు. ఇదే కూడలి వద్ద గల బాలగంగాధర్ తిలక్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం సార్వజనిక్ గణేష్ మండలి అధ్యక్షుడు బంటు గణేష్ జెండా ఊపి శోభాయాత్ర రథాన్ని ప్రారంభించారు. అందంగా అలంకరించిన సార్వజనిక్ గణేష్ మండలి శోభాయాత్ర రథం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గణేష్ నిమజ్జనోత్సవాన్ని ఆనందోత్సాహాల నడుమ, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భుజంగరావు కోరారు. శోభాయాత్రకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం తరఫున అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. వినాయక విగ్రహాలను విసర్జనం చేసే యంచ, ఉమ్మెడతో పాటు అన్ని మండల కేంద్రాలలో అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందన్నారు. నిమజ్జోనోత్సవం సాఫీగా సాగేలా పర్యవేక్షించేందుకు సెక్టోరల్ అధికారులను నియమించామని తెలిపారు. నిమజ్జన ప్రదేశాల వద్ద ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, సరిపడా సంఖ్యలో క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. అన్ని శాఖలు పరస్పరం సమన్వయంతో పని చేస్తున్నాయని, బారికేడ్లు, విద్యుత్ దీపాలు వంటి వసతులు నెలకొల్పామన్నారు. కాగా, శోభాయాత్ర సందర్భంగా సుమారు రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

# వెళ్ళి రావయ్యా... బొజ్జ గణపయ్య.

**-ఘనంగా వినాయక నిమజ్జనం.**







**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

గత 12 రోజులు పూజలు అందుకున్న వినాయకుడిని శు క్రవారం వెళ్లి రావయ్యా గణపయ్య అంటూ ఘనంగా నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో వినాయకుల బావి వద్ద భక్తుల సందడితో జాతర తలపించింది. ఆటపాటలతో నృత్యాలు, కోలాటాలు ఆడుతూ గణనాథులను నిమజ్జనానికి తరలించారు.

**వినాయక్ నగర్ న్యూ హౌసింగ్ బోర్డు కాలనీ లో...**

నగరంలోని వినాయక్ నగర్ న్యూ హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడిని కాలనీ ఆడపడుచులు, యువకులు నృత్యాలు చేస్తూ నిమజ్జనానికి తరలించారు.

**ఈస్ట్ బ్యాక్ కాలనీలో మట్టి గణపతి నిమజ్జనం.**

నగరంలోని ఈస్ట్ బ్యాంకు కాలనీలో కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన మట్టి గణపతినీ ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వినోద్ కుమార్, కార్యదర్శి గణేష్ తదితరులు పాల్గొన్నారు.





# వయసుపై వస్తున్న రూమర్స్‌కు వైష్ణవి చైతన్య చెక్

**హైదరాబాద్, సెప్టెంబరు 25 :** టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ వైష్ణవి చైతన్య తన వయసుపై వస్తున్న రూమర్స్‌కు చెక్ పెట్టారు. యూట్యూబర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె షార్ట్ ఫిలింస్, వెబ్ సిరీస్‌ల ద్వారా గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం సినిమాల్లోకి అడుగుపెట్టి 'అల వైకుంఠపురములో', 'రంగ్ దే', 'టక్ జగదీష్', 'వరుడు కావలెను' వంటి చిత్రాల్లో సహాయక పాత్రల్లో నటించారు. 'బేబీ' సినిమాతో హీరోయిన్‌గా అరంగేట్రం చేసిన వైష్ణవి.. ఆ చిత్రంతో ఒక్కసారిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'లవ్ మీ', 'జాక్' చిత్రాల్లో కథానాయికగా నటించారు. ఇటీవల ఆనంద్ దేవరకొండతో కలిసి 'ఎపిక్' సినిమాలో కనిపించారు. సెప్టెంబరు 11న విడుదలైన ఈ సినిమా ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన అందుకుంది. 'ఎపిక్' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వైష్ణవిని యాంకర్ ఆమె వయసుపై ప్రశ్నించారు. వికీపీడియాలో తన వయసు 32 ఏళ్లుగా ఉందని, అయినప్పటికీ 25 ఏళ్ల అమ్మాయిలా కనిపిస్తున్నారని.. అందుకు కారణం ఏమిటని అడిగారు. దీనికి స్పందించిన వైష్ణవి.. వికీపీడియాలో తన వయసుతో పాటు పుట్టిన ప్రదేశానికి సంబంధించిన వివరాలు కూడా తప్పుగా ఉన్నాయని స్పష్టం చేశారు. తన వయసు 25 ఏళ్లు మాత్రమేనని వైష్ణవి తెలిపారు. ఇదే ఇంటర్వ్యూలో యాంకర్ ఆధార్ కార్డు ఫొటో చూపించగలరా అని అడగ్గా.. వైష్ణవి తన మొబైల్‌లో ఉన్న ఆధార్ చిత్రాన్ని చూపించినట్లు సమాచారం. అందులో ఆమె పుట్టిన సంవత్సరం 2001గా ఉందని తెలుస్తోంది. దీంతో వైష్ణవి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



# కాయదుకు వరుస పరాజయాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 25 :** కన్నడ చిత్రం 'ముగిల్‌పేట'తో సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన కాయదు లోహార్‌కు వరుస పరాజయాలు ఎదురవుతున్నాయి. గ్లామర్‌తో పాటు నటనతోనూ ఆకట్టుకునే అవకాశం ఉన్న ఈ భామకు మంచి అవకాశాలు వస్తున్నప్పటికీ.. అవి మాత్రం ఆశించిన విజయాలను అందించలేకపోతున్నాయి. ముఖ్యంగా తెలుగు చిత్రసీమలో ఆమె నటించిన సినిమాలు వరుసగా నిరాశపరచడంతో కెరీర్‌పై ప్రభావం పడుతోంది. శ్రీవిష్ణు సరసన నటించిన 'అల్లూరి'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కాయదు.. ఆ తర్వాత 'ఫంకీ'లోనూ కనిపించింది. అయితే ఈ రెండు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేదు. దీంతో వరుసగా సినిమాలు చేస్తున్నా.. ఖాతాలో చెప్పుకోదగ్గ కమర్షియల్ హిట్ లేకపోవడం ఆమెకు ప్రతికూలంగా మారింది.

## 'ది ప్యారడైజ్'తోనూ నిరాశే..

నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ది ప్యారడైజ్'లో కాయదుకు అవకాశం లభించింది. అయితే ఈ సినిమాలో ఆమె పోషించిన పాత్రపై ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. తండ్రి చేసిన అప్పులను తీర్చే క్రమంలో బి-గ్రేడ్ చిత్రాల్లో నటించే యువతిగా ఆమె పాత్రను తీర్చిదిద్దారు. ఈ పాత్ర ఎంపికపై కొందరు ప్రేక్షకులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

## కథల ఎంపికపై దృష్టి అవసరం

గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు ఎంచుకునే అవకాశం కాయదు లోహార్‌కు ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే కథ, పాత్రల ఎంపిక విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంచి అవకాశాలను విజయాలుగా మలుచుకుని, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం కాయదు కెరీర్‌లో కీలకంగా మారనుంది.

# 'సిగ్మా'లో మంచి ఎమోషనల్ క్యారెక్టర్: ఫరియా

హైదరాబాద్, సెప్టెంబరు 25 : సందీప్ కిషన్ హీరోగా జేసన్ సంజయ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సిగ్మా' చిత్రంలో ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటించారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ సినిమా అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఫరియా మీడియాతో మాట్లాడారు. 'సిగ్మా'లో తాను రేడియో జాకీ పాత్రలో కనిపిస్తానని ఫరియా తెలిపారు. తన పాత్రలో అన్ని రకాల భావోద్వేగాలను చూపించే అవకాశం లభించిందని చెప్పారు. యాక్షన్, అడ్వెంచర్, కామెడీ అంశాలతో రూపొందిన ఈ చిత్రాన్ని కుటుంబంతో కలిసి హాయిగా చూడొచ్చని పేర్కొన్నారు. సందీప్ కిషన్‌తో కలిసి సినిమా చేయాలని చాలా కాలంగా అనుకుంటున్నామని, చివరకు 'సిగ్మా'తో ఆ అవకాశం వచ్చిందని ఫరియా వెల్లడించారు. దర్శకుడు జేసన్ సంజయ్ జూమ్ కాల్‌లో కథ చెప్పారని, కథ విన్న తర్వాత ఆయన వయసు అడిగితే 24 ఏళ్లని చెప్పారని గుర్తుచేసుకున్నారు. తొలి సినిమా అయినప్పటికీ జేసన్ ఎంతో స్పష్టత, విజన్‌తో చిత్రాన్ని తెరకెక్కించారని ఫరియా ప్రశంసించారు. సూపర్‌స్టార్ విజయ్ కుమారుడనే భావన ఆయనలో ఏమాత్రం కనిపించదని, చాలా వినయంగా, స్నేహపూర్వకంగా ఉంటారని అన్నారు. 'సిగ్మా' లాంటి మంచి ప్రాజెక్ట్‌తో తమిళ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉందని, తమన్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని ఫరియా పేర్కొన్నారు.



# 'లవ్ అండ్ వార్'లో ఆలియా భట్ ఫస్ట్ లుక్

హైదరాబాద్, సెప్టెంబరు 25 : బాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ 'లవ్ అండ్ వార్' నుంచి వరుస అప్‌డేట్స్ వస్తున్నాయి. ఇప్పటికే రణ్‌బీర్ కపూర్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన చిత్రబృందం.. తాజాగా ఆలియా భట్ ఫస్ట్ లుక్‌ను కూడా అభిమానులతో పంచుకుంది. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'ఆగ్ భీ, దిల్ కీ జాన్ భీ!' అనే క్యాప్షన్‌తో విడుదల చేసిన ఆలియా భట్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రేమ, భావోద్వేగాలతో పాటు యాక్షన్ అంశాలను మేళవించి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్‌తో పాటు విక్కీ కౌశల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. స్టార్ హీరోహీరోయిన్ల కాంబినేషన్‌కు భన్సాలీ దర్శకత్వం తోడవడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే 'లవ్ అండ్ వార్' 2027 జనవరి 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

